సిరిసిల్ల పవర్ లూమ్ పరిశ్రమకు ప్రభుత్వం అండగా ఉండాలి : కెటిఆర్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

పవర్ లూమ్ వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లకుండా గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను కొనసాగించాలని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ కోరారు. సిరిసిల్ల పవర్ లూమ్ పరిశ్రమపై ఆయన ట్వీట్ చేశారు. గత పది సంవత్సరాల్లో అక్కడ పరిశ్రమ ఎంతగానో అభివృద్ధి చెందిందని.. నేతన్నల జీవితాలు మెరుగుపడటమే కాకుండా తమ కార్యకలాపాలను విస్తరించారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అందించిన సహకారమే దీనికి ప్రధాన కారణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పవర్ లూమ్ పరిశ్రమకు అండగా నిలవాలని.. బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ సహకారం ఉంటే తమిళనాడులో ఉన్న తిరుపూర్ వస్త్ర పరిశ్రమతో సమానంగా పోటీ పడగలిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ రంగానికి సంబంధించి గత 15 రోజులుగా వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని.. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి వెళుతుందని పేర్కొన్నారు.

ఆది ధ్వని పరికరాలను తిలకించిన కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జన సమితి (టిజెఎస్) అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం బుధవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావ్ సేకరించి భద్రపరిచిన ప్రాచీన కలల ఆది ధ్వని పరికరాలు, ప్రాచీన ఆదివాసీ సంప్రదాయ వస్తువులను తిలకించారు. ఆది ధ్వని వస్తువులు, పరికరాల గురించి అడిగి తెలుసుకున్నారు.

ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్లో నమోదు చేయాలి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్లో నమోదు చేయాలని, ఫిర్యాదుదారులకు రశీదు ఇవ్వాలని ఎస్పీ రితిరాజ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను, సిబ్బంది విధులను పరిశీలించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, సిబ్బంది ప్రాఫర్ యూనిఫామ్ మెయింటనెన్స్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో వాహనాల పార్కింగ్ ప్రదేశం, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్ టీమ్, ఎస్‌హెచ్‌వో, మెన్‌రెస్ట్‌రూమ్, లాక్ ఆఫ్‌రూమ్‌లను తనిఖీ చేశారు. కోర్టు విధులు నిర్వహించే అధికారుల గదిలో రికార్డులను భద్రపరిచిన తీరును, 5-ఎస్ అమలును పరిశీలించారు. జనరల్ డైరీ, సెంట్రీ రిలీఫ్ బుక్, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, ప్రాసెస్ రిజిస్టర్లతో పాటు, అన్ని రికార్డులను తనిఖీ చేశారు. గ్రేవ్, నాన్ గ్రేవ్, సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని ఎస్ఐకి సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తమ దష్టికి తీసుకురావాలన్నారు. మహిళా అధికారులు, సిబ్బందికి సంబంధించి రెస్ట్ రూమ్, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. దొంగతనాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలని చెప్పారు. 24 గంటల పాటు నిరంతర గస్తీ నిర్వహించాలని, రౌడీ షీటర్లు, అనుమానిత, పాత నేరస్థులపై నిఘా ఉంచాలని బ్లూ కోల్ట్స్ సిబ్బందికి, అధికారులకు సూచించారు. గంజాయి, గుట్కా, గుడుంబా సరఫరా, గ్యాంబ్లింగ్‌పై నిఘా ఉంచాలని ఆదేశించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని చెప్పారు.

పెట్టుబడులు పెట్టండి

- దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో సిఎం రేవంత్‌రెడ్డి బృందం
- అంతర్జాతీయ కంపెనీల సిఇఒలతో భేటీ
- 'ఇన్వెస్ట్ ఇన్ తెలంగాణ' పేరుతో పెట్టుబడుల ఆకర్షణ

ప్రజాశక్తి-హైదరాబాద్

'ఇన్వెస్ట్ ఇన్ తెలంగాణ' పేరుతో రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం దావోస్‌లో పర్యటిస్తోంది. తొలిరోజు సిఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పలు అంతర్జాతీయ కంపెనీల సిఇఒలతో భేటీ అయ్యారు. ఐటీ, జీవ వైద్య శాస్త్ర రంగంలో పెట్టుబడులకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్టు వారు తెలిపారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం అధ్యక్షులు బోర్గ్ బ్రెండెతో పాలు ఆ సంస్థ నిర్వాహకులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను చర్చించారు. రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వ ప్రాధాన్యతలను వారికి వివరించారు. ప్రభుత్వాలతో పారిశ్రామికవేత్తలు, వ్యాపార, వాణిజ్య వాటాదారులు కలిసి పని చేస్తే ప్రజలు సంపన్నులు అవుతారని, సుస్థిరమైన అభివృద్ధితో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. అనంతరం ఇథియోపియా ఉపప్రధాని డెమెక్ హసెంటోతో సమావేశమయ్యారు. పారిశ్రామిక అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంచుకున్న రూట్‌మ్యాప్‌ను వారికి వివరించారు. నేషనల్ అసోషియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కాం) అధ్యక్షులు శ్రీమతి దేబ్జానీ ఘోష్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నైపుణ్య శిక్షణా రంగంలో ఉన్న అవకాశాలను వారికి వివరించారు. ఇంజినీరింగ్, డిగ్రీ కోర్సులు చదువుతున్న యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగాలు, ఉపాధి వంటి అంశాలపై ఈ చర్చలు జరిగాయి.

ఘన స్వాగతం

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ 54వ వార్షిక సదస్సు మూడురోజుల పాటు జరుగనుంది. దీనిలో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుకు పలువురు ప్రవాసీ భారత ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. జ్యూరిచ్ ఎయిర్‌పోర్ట్‌లో వారితో భేటీ అయ్యారు. నవ తెలంగాణ నిర్మాణం కోసం మొదలైన తమ ప్రభుత్వ ప్రయత్నంలో వారంతా భాగస్వాములు కావటంపై ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లో సి4ఐఆర్ కార్యాలయం
ఫోరమ్ చీఫ్ బొర్గె బ్రెండే, సిఎం రేవంత్‌రెడ్డి సంయుక్త ప్రకటన

దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో తెలంగాణకు అరుదైన అవకాశం దక్కింది. సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్ (సి4ఐఆర్) కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించేందుకు ఒప్పందం కుదిరింది. మంగళవారం ఫోరం అధ్యక్షులు బోర్గే బ్రెండే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంయుక్త ప్రకటన చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో టెక్నాలజీ కలయికతో అత్యాధునిక సాంకేతికతను వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ రాష్ట్రానికి విశిష్ట సహకారం అందించనుందని ఆయన తెలిపారు. బయో ఏషియా సదస్సులో భాగంగా ఫిబ్రవరి 28న ఈ సెంటర్ ప్రారంభించనున్నట్టు సిఎం వెల్లడించారు. "వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ విశాల దృక్పథం, నిర్దేశించుకున్న లక్ష్యాలన్నీ తెలంగాణ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఉన్నాయి. జీవన విధానాలు, నాణ్యత ప్రమాణాలు మెరుగుపరిస్తే ప్రజల జీవితాలు బాగుపడుతాయనే ఆలోచనల సారూప్యతకు కట్టుబడి ఉన్నాం. ఫోరమ్ ప్రపంచ స్థాయిలో పని చేస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది ప్రజలపై దష్టి కేంద్రీకరిస్తోంది. ఇరువురి భాగస్వామ్యంతో ప్రజల ఆరోగ్యం, సాంకేతికత, మంచి జీవితం అందించాలనే లక్ష్యాలను వేగంగా అందుకోవచ్చు" అని అన్నారు. ప్రపంచ స్థాయిలో ఆరోగ్య సంరక్షణ విధానాలను సరికొత్తగా పునర్నిర్వించే ఆలోచనల నేపథ్యంలో చిన్న పట్టణాలు, గ్రామాలకు ఈ సేవలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని ఆయన చెప్పారు. దీంతో రోగులకు మెరుగైన సేవలు అందడంతో పాటు ఆరోగ్య సంరక్షణలో కొత్త సాంకేతిక విధానాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి. కొత్త ఆవిష్కరణలకు స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని భావిస్తున్నారు.

, దావోస్‌లో ఆకట్టుకుంటున్న తెలంగాణ పెవిలియన్

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్ ఆహూతులను విశేషంగా ఆకర్షిస్తున్నది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను చాటేలా ఈ వేదికను రూపొందించారు. బతుకమ్మ, బోనాలు పండుగలు, చారిత్రక వారసత్వ సంపద చిహ్నం చార్మినార్, చేర్యాల పెయింటింగ్, పోచంపల్లి ఇక్కత్, ఐటీ, టీ హబ్, స్కైరూట్ ఏరోస్పేస్ వంటి భిన్నరంగాల మేళవింపుతో ఈ పెవిలియన్‌ను తీర్చిదిద్దారు. 'ఇన్వెస్ ఇన్ తెలంగాణ' పేరుతో తమ వద్ద వివిధ రంగాల్లో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలుపుతూ నినాదాలు రాసారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక హోర్డింగ్‌ను ఇక్కడ నెలకొల్పారు.

ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ ధ్వంసం..

- ఆగ్రహించిన కెటిఆర్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్' ట్విటర్ వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ డిజిపిని ఎమ్మెల్యే కెటిఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజమంతా ఎంతగానో గౌరవించుకునే ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ధ్వంసం చేయడం అత్యంత హీనమైన చర్యని అన్నారు. ఆయన విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు.

సమష్టిగా రైల్వేలైన్ సాధిద్దాం

సాధన కమిటీ అధ్యక్షుడు ఎంసీ లింగన్న

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

నిర్మల్ జిల్లా మీదుగా రైల్వేలైన్ నిర్మాణం చేపట్టే వరకు అన్నివర్గాలు, సంఘాలు, పార్టీలు కలిసి సమష్టిగా పనిచేద్దామని ఆదిలాబాద్ - ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కమిటీ అధ్యక్షుడు ఎంసి.లింగన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో పార్టీలు, సంఘాలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సాధన కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎంసీ.లింగన్న, కన్వీనర్‌గా ఈసవేణి మనోజ్‌యాదవ్ ఎన్నికయ్యారు. అనంతరం లింగన్న మాట్లాడుతూ రైల్వేలైన్ సాధించే వరకు వివిధ స్థాయిలలో అందరినీ కలుపుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసి వచ్చేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు రావుల రాంనాథ్, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, శేఖర్, ఎస్ఎన్.రెడ్డి, మల్లారెడ్డి, వెల్మల ప్రభాకర్, సాయన్న, రాములు, వెంకట్‌స్వామి, రంజిత్, ముత్యంయాదవ్, గణేశ్, లక్ష్మణ్, మురళీమనోహర్‌రెడ్డి, పద్మనాభంగౌడ్, విలాస్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో దారుణం..

- భార్య తల నరికిన భర్త

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్ నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసు స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. జెఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉండే వినయ్.. అతి కిరాతకంగా తన భార్య పుష్పలత తల నరికి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. తన భార్యకు మరొకరితో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతోనే నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. పుష్పలతకు గతంలో రెండు పెళ్లిళ్ల జరిగాయని స్థానికులు తెలిపారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

కూలి పెంచేదెప్పుడు..!

- గడ్డిఅన్నారం ఫ్రూట్ మార్కెట్‌లో హమాలీల వెట్టిచాకిరీ
- ఏడేళ్లుగా పెరగని కూలి రేట్లు
- పొద్దంతా పనిచేసినా గిట్టడం లేదంటున్న కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పండ్ల బస్తాలు మోసి హమాలీ కార్మికుల భుజాలు అరుగుతున్నాయి. బతుకు బండిని లాగడం కోసం ఎంత బరువైనా మోస్తూ హమాలీలు తమ చెమట చుక్కలను చిందిస్తున్నారు. అయినా వాళ్ల కష్టానికి ఫలితం దక్కడం లేదు. అన్ని వస్తువుల ధరలు పెరుగుతున్నా ఏడేండ్లుగా హమాలీల కూలి రేట్లు మాత్రం పెరగడం లేదు. వారి గోస ఎవరికి చెప్పుకునే పరిస్థితి కూడా లేదు. ప్రభుత్వం తమ గోడు విని కూలి రేట్లు పెంచాలని హమాలీలు కోరుతున్నారు.

రంగారెడ్డి జిల్లాలోని గడ్డిఅన్నారం ఫ్రూట్ మార్కెట్‌లో సుమారు 10 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. రెగ్యులర్‌గా ఆరు వేల మంది హమాలీ కార్మికులు పనిచేస్తారు. ఇక్కడ పనిచేసే కార్మికుల్లో అత్యధికులు వలస కార్మికులు. వివిధ రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన వారే. మార్కెట్‌లో ప్రతి రెండేండ్లకు ఒకసారి కూలి రేట్లు పెంచాల్సి ఉంది. కానీ మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లతో కుమ్మక్కైన అధికారులు కార్మికులు సమస్యలను గాలికి వదిలేశారు. కార్మికులతో చర్చలు జరిపి కూలి రేటు పెంచాల్సిన అధికారులు దాటవేస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ మార్కెట్ గతంలో కొత్తపేటలో ఉండగా.. బాటసింగారానికి తరలించారు. ప్రస్తుతం అక్కడే కొనసాగుతోంది.

2017లో సంబంధిత అధికారులు కార్మికులతో చర్చలు జరిపారు. అప్పుడు పెంచిన హమాలీ రేట్లే నేటికీ కొనసాగుతున్నాయి. అయితే, కార్మిక చట్టాల నిబంధనల ప్రకారం కూలి రేట్లు పెంచితే 75 శాతం పెరగాల్సి ఉంది. దాంతో అధికారులు కూలిరేట్ల పెంపుపై స్పందించడం లేదు. మామిడి టన్ను అన్‌లోడు చేస్తే రూ.150, ఆపిల్ రూ.90, బొప్పాయి రూ.100, పనస రూ.64, జామ ఒక్క బాక్స్‌కు రూ.4.67.. ఇలా మార్కెట్ కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ రేట్లు గిట్టుబాటు కావడం లేదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూలి రేట్లు 75 శాతం పెరగాలి

కార్మిక చట్టాల నిబంధనాల మేరకు ప్రతి రెండేండ్లకు ఒకసారి కూలి రేట్లు పెంచాలి. కానీ ఏడేండ్లుగా పెంచలేదు. ఇప్పటి వరకు 75 శాతం కూలి రేట్లు పెంచాల్సి ఉంది. ప్రస్తుతం మామిడి టన్ను అన్‌లోడు చేస్తే రూ.150 ఇస్తున్నారు. కూలి రేట్లు పెంచితే రూ.275 వచ్చే అవకాశం ఉంది. కూలి రేట్లు పెంచాలని కార్మికులు గతంలో చాలా సార్లు మార్కెటింగ్ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. ప్రభుత్వం తక్షణమే స్పందించి హమాలీ రేట్లు పెంచాలని కార్మికులు కోరుతున్నారు.

హమాలీ కూలి పెంచాలి మల్లేపాక వీరయ్య, హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు

పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచాలి. గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్‌లో కార్మికుల శ్రమను దోచుకుంటున్న దళారులపై చర్యలు తీసుకోవాలి. కార్మికులకు న్యాయం చేయాలి.

కూలి గిట్టడం లేదు
మసూద్, ఫ్రూట్ మార్కెట్ హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు

పొద్దంతా పనిచేసినా కూలి గిట్టడం లేదు. ఏడేండ్ల కింద కూలి రేట్లు పెంచారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా పెంచలే. రోజువారీ కూలి రూ.300 కూడా వచ్చే పరిస్థితి లేదు. ఆ డబ్బులతో కుటుంబం పోషించేది ఎట్లా.. నలబై ఏండ్లుగా హమాలీ పనిచేస్తున్న.. ఇప్పటికీ కూలీ చేస్తేనే.. బుక్కెడు బువ్వ.. లేదంటే పస్తులే.. మా బతుకులను పట్టించుకునే దిక్కులేదు. మాకు కూలీ రేట్లు పెంచి ఆదుకోవాలి.

త్వరలో సమస్యలు పరిష్కారిస్తాంచిలుక
నర్సింహారెడ్డి, ఉన్నతశ్రేణి కార్యదర్శి, గడ్డిఅన్నారం మార్కెట్

హమాలీ కార్మికులు కూలి రేట్ల పెంపుపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. రైతులతో చర్చలు కొనసాగుతున్నాయి. త్వరలో ప్రభుత్వం నుంచి హమాలీ కార్మికులకు శుభవార్త అందుతుంది. కార్మికులు ఎలాంటి ఆందోళన చెందొద్దు. కార్మికులు కోరుకున్న కూలి రేట్లు పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది.

ఖరీఫ్‌కు గోదావరి జలాలు

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ఎంత డబ్బు, అహంకారం, అధికారం ఉన్నా ప్రజల ముందు దిగదుడుపే అని తెలంగాణ ప్రజలు నిరూపించారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అందరం ఏది కాదనుకున్నామో, వద్దనుకున్నామో దానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులలో ఎవరైతే నిజంగా అర్హులో వారిని గుర్తించాల్సిన బాధ్యత ఉందన్నారు. అధికారులు కూడా నిజమైన అర్హులకు ఇస్తే అది ఇందిరమ్మ రాజ్యం అవుతుందన్నారు. ఆరు గ్యారెంటీలు పేద ప్రజలు కోరుకునే కనీస అవసరాలని చెప్పుకొచ్చారు. గత ముఖ్యమంత్రి మాటలకే పరిమితమై కొన్ని కార్యక్రమాలు తుంగలో తొక్కారని విమర్శించారు. ఈనాటి ముఖ్యమంత్రి ప్రజల వద్దకు పంపించి ప్రజల ముందే ఆ కార్యక్రమాలు చేసుకోమని చెప్పారన్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ పంటకాలానికి ఖమ్మం జిల్లాలోకి గోదావరి జలాలు ప్రవేశిస్తాయని స్పష్టం చేశారు. "తప్పకుండా మా పదవీ కాలంలోనే ఆ నీళ్ల మీకు రావాలని మేము ప్రయత్నం చేస్తున్నాం" అని చెప్పారు. జాతీయ రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమం అన్నింటినీ బాధ్యత తాము తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

కార్యకర్త హత్యను రాజకీయం వాడుకోవడం తగదు : జూపల్లి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

కొల్లాపూర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ కార్యకర్త (మాజీ జవాను) మల్లేష్ హత్యను రాజకీయంగా వాడుకోవడం ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ స్థాయికి తగదని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు హితవు పలికారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహించే ప్రసక్తే లేదన్నారు. స్థానిక నాయకులు చెప్పగానే వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. కెటిఆర్.. ఆయన స్థాయిని ఆయనే తగ్గించుకుంటున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందే కుటుంబ, భూతగాదాలతో మల్లేష్ హత్య జరిగినట్లు దర్యాప్తులో తేలిందని మంత్రి పేర్కొన్నారు. మల్లేష్ హత్యను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం సరైంది కాదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక తప్పుడు కేసులు పెట్టారని.. ఆధారాలతో సహా పోలీసులు, ప్రగతిభవన్ ప్రముఖులకు పంపించినా ఆనాడు ఎవరూ స్పందించలేదన్నారు. కొండగట్టు వద్ద ప్రమాదంలో 60 మంది చనిపోయినా.. హైకోర్టు న్యాయవాది వామన్ రావు దంపతులు నడిరోడ్డుపై హత్యకు గురైతే పరామర్శించేందుకు వెళ్లని కేటీఆర్.. అక్కడికి వెళ్లడం రాజకీయం కాదా? అని ప్రశ్నించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లిలో గత డిసెంబరులో హత్యకు గురైన బిఆర్ఎస్ కార్యకర్త మల్లేష్ కుటుంబాన్ని ఆదివారం కెటిఆర్ పరామర్శించారు. ఆ సమయంలో మాట్లాడుతూ.. కార్యకర్తలను సమిధలుగా చేసే సంస్కృతి మంచిదికాదని మంత్రి జూపల్లి కష్ణారావుకు, కాంగ్రెస్ ప్రభుత్వానికి చెబుతున్నానని అన్నారు.

భూపోరాట నేతలకు రిమాండ్

- జగిత్యాలలో సిపిఎం నాయకులపై కేసులు
- ప్రభుత్వ భూముల్లో పేదలతో గుడిసెలు వేయించారని ఆరోపణ
- అడ్డుకునేందుకు వెళ్లిన వారిపై దాడి చేశారని కేసులు నమోదు
- జత పాత కేసులు
- గుడిసెలు తొలగించిన రెవెన్యూ, పోలీసు అధికారులు
- అరెస్టులతో భయపడేది లేదు.. పోరాటాన్ని ఆపబోం: సిపిఎం నాయకులు

ఘటనాస్థలంలో గుడిసెలు తొలగిస్తుండగా పహారా కాస్తున్న పోలీసులు ,ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లా కేంద్రం శివారులోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదల పక్షాన పోరాడుతున్న సిపిఎం నాయకులను పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేయడాన్ని అడ్డుకునేందుకు వెళ్లిన వారిపై దాడికి దిగారని, అందుకు ప్రోత్సహించారన్న పేరుతో గతంలో ఉన్న కేసులనూ జత చేస్తూ పార్టీ నాయకులతో కలిపి 9 మందిని రిమాండ్‌కు తరలించారు. పేదల గుడిసెలను రెవెన్యూ, పోలీసు సిబ్బంది తొలగించారు.

జగిత్యాల జిల్లా కోరుట్లలో మొదలైన పేదల భూపోరాటం జగిత్యాల జిల్లా కేంద్రానికి చేరిన విషయం తెలిసిందే. జగిత్యాల జిల్లా కేంద్ర శివారులోని టిఆర్‌నగర్‌లోని ప్రభుత్వ భూముల్లో సిపిఎం ఆధ్వర్యంలో వేలాది మంది పేదలు గుడిసెలు వేసుకున్నారు. మూన్నెళ్ళుగా అక్కడే ఉంటున్నారు. గుడిసెలు వేసుకున్న స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు అందించాలని పోరాడుతున్నారు. పలు రూపాల్లో నిరసనలూ తెలిపారు. గత నెల 18న వేలాది మంది పేదలు కలెక్టరేట్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి.. తమ అర్జీలను ఆర్‌డిఒ కార్యాలయంలో అందించారు. ఇక అప్పటి నుంచి సదరు ప్రభుత్వ భూముల్లో మిగిలిన స్థలంలోనూ మరికొందరు పేదలు గుడిసెలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు స్థానికులు దాన్ని అడ్డగించారు. ఇదే అదనుగా పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు రంగప్రవేశం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని, అడ్డుకునేందుకు వచ్చిన వారిపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆ పేదల పోరాటానికి అండగా నిలిచిన సిపిఎం నాయకులను మంగళవారం అకస్మాత్తుగా పోలీసులు అరెస్టు చేశారు. 24 మందిపై కేసులు నమోదు చేయగా.. అందులో 9 మందిపై 307 సహా గతంలో కోరుట్లలోనూ నమోదైన కేసులను జత చేశారు. ఆ 9 మందిని రిమాండ్ చేస్తూ కరీంనగర్ జైలుకు పంపించారు. రిమాండ్ అయిన నాయకుల్లో సిపిఎం రాష్ట్ర నాయకులు లెల్లల బాలకృష్ణ, పార్టీ జిల్లా కన్వీనర్ గుగులోతు తిరుపతి నాయక్, నాయకులు కడకుంట్ల నాగరాజు, గర్వందుల రమేష్, ఇందూరు సులోచన, ఎల్ల పోచన్న, కుంచేపు శంకర్, పిట్టల హేమలత, రజియా సుల్తానా ఉన్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వర్ణవెంకట్‌రెడ్డి ఘటనాస్థలానికి వెళ్లారు. పేదల పక్షాన పోరాడుతున్న నాయకులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి అరెస్టులకు, బెదిరింపులకు భయపడే వాళ్లం కాదని, పేదలకు ఇండ్ల స్థలాలు, పట్టాలు ఇచ్చేవరకూ పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు.

కౌలు రైతుల్లో కలవరం..

- పెరిగిన పెట్టుబడి
- పంటకు దక్కని గిట్టుబాటు
- అప్పుల భారం తట్టుకోలేక ఆత్మహత్యకు ఒడిగడుతున్న వైనం
- ఏటా నమోదవుతున్న ఘటనలు..

భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన కౌలు రైతు ఎడిపెల్లి రమేష్ (50) 12 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశారు. పంట సరిగా పండక.. దిగుబడి రాక.. గిట్టుబాటుగాక అప్పు తీరదనే బెంగతో ఇంట్లో పురుగు మందు తాగి ఉరేసుకున్నాడు. ఇలా ఎంతో మంది రైతులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏటా ప్రాణం తీసుకుంటుండటం.. కౌలు రైతుల కుటుంబాల దుర్భర స్థితిని తెలియజేస్తోంది. భూమిని కౌలుకు తీసుకుని పెట్టుబడులు పెట్టి.. కాయకష్టం చేస్తున్న కౌలు రైతుల పరిస్థితి నానాటికీ మరింత దిగజారుతోంది. వచ్చిన లాభంలో పెట్టుబడి కోసం తీసుకొచ్చిన అప్పులు చెల్లించడంతోపాటు కౌలు డబ్బులూ చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ పంట పండకపోతే పెట్టుబడి కోల్పోవడంతోపాటు కౌలు డబ్బులు చేతి నుంచే చెల్లించాల్సి వస్తుందటంతో అప్పుల భారం మరింత పెరిగిపోతోంది. పంట పండక.. చేసిన అప్పులు చెల్లించలేక.. ప్రభుత్వాల నుంచి సాయం అందకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో కౌలు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ప్రతి ఏటా ఎంతో మంది ఇలా ప్రాణం తీసుకుంటున్నా.. కుటుంబాలు రోడ్డున పడుతున్నా పాలకులు దృష్టిసారించడం లేదు. తాజాగా రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వమైనా కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.



ప్రజాశక్తి-హైదరాబాద్

వ్యవసాయం మాత్రమే తెలిసి.. అదే జీవనాధారంగా రైతులు బతుకుతున్నారు. సొంత భూమి లేకపోయినా.. ఇతరుల నుంచి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,17,268మంది రైతులు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. ఇందులో ఆదిలాబాద్‌లో 28,763 మంది, నిర్మల్‌లో 33,212 మంది, మంచిర్యాలలో 28,584, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 26,754మంది కౌలు రైతులు వ్యవసాయం సాగిస్తున్నారు. కౌలు రైతులకు గతంలో ప్రభుత్వం రుణ అర్హత కార్డులు అందజేసినా.. తెలంగాణ ఏర్పడిన తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వం వాటిని తొలగించింది. పహణీల నుంచి కాస్తు కాలమ్ కూడా తొలగించింది. దీంతో పంటలు పండించిన కౌలు రైతులకు వాటిపై ఎలాంటి హక్కూ ఉండదు. పంట అమ్ముకోవాలన్నా భూ యజమాని పేరుపై విక్రయించాల్సి వస్తుంది. మరోపక్క కౌలు వ్యవసాయం గతంలో కొంత లాభం చేకూరినా.. ప్రస్తుతం పెరిగిన కౌలు డబ్బులతో పాటు పెట్టుబడీ భారీగా పెరగడం.. మరోపక్క ప్రకృతి సహకరించకపోవడం వంటి కారణాలతో పంటలు పండించడం కష్టంగా మారిందని రైతులు అంటున్నారు.

అప్పులు తీర్చలేక అవస్థలు..!

ఏటా వ్యవసాయం లాభదాయకంగా ఉండటం లేదు. పంట కోసం దళారులు, ఇతరుల వద్ద అప్పులు తీసుకురావాల్సి వస్తోంది. ప్రభుత్వాల నుంచి ఎలాంటి సహాయమూ అందడం లేదు. రుణ అర్హత కార్డు లేకపోవడంతోపాటు ఫసల్ బీమా వర్తించదు. వాతావరణ ఆధారిత బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు. నకిలీ విత్తనాల బెడద, పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు లేకపోవడం, ఎరువుల ధరలు విపరీతంగా పెరగడం తదితర కారణాలతో కౌలు రైతులు దయనీయ స్థితిని ఎదుర్కోవాల్సి వస్తోంది.

ఇప్పటికైనా మేలు జరిగేనా..?

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులతో పాటు కౌలు రైతులకు కూడా మేలు చేస్తామని హామీనిచ్చింది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతుభరోసా పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం అమల్లో భాగంగా రైతులతో పాటు కౌలు రైతులకూ ఏడాదికి ఎకరానికి రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తామని భరోసా ఇచ్చింది. దీంతో ప్రభుత్వం భరోసా కౌలు రైతులకు కొంత ఊరట చెందే పరిణామంగా మారింది. కౌలు రైతుల పేర్లు గుర్తించడంతో పాటు వారికి ఏటా ఈ సాయం అందిస్తామని చెప్పడంతో కొంతైనా లాభం చేకూరే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కౌలు రైతులు పడుతున్న బాధ కొంతైనా తీరుతుందని ఆశిస్తున్నారు.

కోదండరాంతో యశస్వినీ రెడ్డి భేటీ

ప్రజాశక్తి-హైదరాబాద్

టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంతో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి భేటీ అయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ కోదండరాం ఇంటికి యశస్వినీ రెడ్డి, తన అత్త ఝాన్సీరెడ్డి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కోదండరాంను శాలువా కప్పి, బొకే అందజేశారు. అనంతరం తాజా రాజకీయాలపై చర్చించారు. పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధి కోసం సలహాలు, సూచనలు అవసరమని వారు కోదండరాంను కోరారు.

అయోధ్యకు 1265 కిలోల లడ్డు

- తయారు చేసిన కంటోన్మెంట్ నివాసి

ప్రజాశక్తి-హైదరాబాద్

ఈ నెల 22న యుపిలోని అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి హైదరాబాద్‌లో లడ్డూ తయారైంది. సందర్శకు లకు ప్రసాదంగా అందిం చేందుకు లడ్డును తయారు చేసే అవకాశం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నివాసి, శ్రీరామ క్యాటర్స్ అధినేత నాగభూషణం రెడ్డి దక్కించుకున్నారు. 1265కిలోల లడ్డును ఆయన తయారు చేశారు. మంగళవారం కంటోన్మెంట్ వాల్మీకినగర్‌లోని హనుమాన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ లడ్డూను ప్రత్యేక వాహనం ద్వారా అయోధ్యకు పంపించడానికి సిద్ధం చేసినట్టు చెప్పారు. బుధవారం ఉదయం సంతోషి మాత దేవాలయం వద్ద సందర్శనార్థం ఉంచుతామని తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం లడ్డు శోభయాత్రను ప్రారంభిస్తామన్నారు.

ఫెర్నాండేజ్ ఆస్పత్రిలో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకుల ఆందోళన

ప్రజాశక్తి-హైదరాబాద్

హైదరాబాద్ అబిడ్స్‌లోని ఫెర్నాండెజ్ ఆస్పత్రిలో మూడ్రోజుల కిందట జన్మించిన పసికందు మృతిచెందాడు. అయితే వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతిచెందాడంటూ కుటుంబీకులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సాయికుమార్‌- అనూషా దంపతులు. అనూషా రెండో కాన్పు కోసం నాలుగు రోజుల కిందట హైదరాబాద్ అబిడ్స్‌లోని ఫెర్నాండెజ్ ఆస్పత్రిలో చేరింది. మూడ్రోజుల కిందట ఆమెకు వైద్యులు ఆపరేషన్ చేయగా.. బాబు జన్మించాడు. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం శిశువు చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. అయితే శిశువు మృతికి కారణాలు తెలపాలని కుటుంబీకులు వైద్యులను నిలదీశారు. అందుకు పొంతనలేని కారణాలు చెప్పారు. దాంతో ఆస్పత్రి ఎదుట వారు ఆందోళనకు దిగారు. డెలివరీ కోసం రూ.మూడున్నర లక్షలు కట్టించుకున్నారని తెలిపారు. బాబు 3.5 కేజీల బరువుతో జన్మించి, ఆరోగ్యంగా ఉంటే ఎలా చనిపోయాడో చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని, ఫెర్నాండేజ్ ఆస్పత్రి వైద్యులపై, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఫెర్నాండేజ్ ఆస్పత్రికి చేరుకుని చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బడ్జెట్‌పై సర్కారు ఫోకస్

- శాఖలవారీగా ప్రతిపాదనలకు ఆదేశం
- 18 నుంచి సమీక్షలు

ప్రజాశక్తి-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌పై ఫోకస్ చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సవానికి (2024-25) సంబంధించి ఆయా శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే అన్ని శాఖల నుంచి ఆర్థికశాఖ ప్రతిపాదనలను కోరింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలకనుగుణంగా ప్రతిపాదనలు పంపించాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత కీలకమైన ఆరు గ్యారంటీల అమలుకు ఆయా శాఖలు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించినట్టు తెలిసింది. మరోవైపు బడ్జెట్ ప్రతిపాదనలపై అన్ని శాఖలతో ఈ నెల 18 నుంచి ఆర్థికశాఖ ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించనుంది. బడ్జెట్ కసరత్తులో భాగంగా అన్ని శాఖలు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరింది. మంత్రులు, అధికారులతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమావేశం కానున్నారు. రోజుకు ఇద్దరు మంత్రుల చొప్పున డిప్యూటీ సిఎం ఆయా శాఖలపై సమావేశం జరగనుంది. ఈ సమావేశాల్లో గ్యారంటీలు, ఎన్నికల హామీల అమలుకు పద్దు కేటాయింపులపై చర్చించ నున్నారు. అలాగే ఉద్యోగ నియామకాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల కు ముందు కేంద్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్‌కు వెళ్తుందా? లేదా పూర్తి బడ్జెట్ ప్రవేశ పెట్టనుందా? అనేది విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

రిటైర్డ్ ఉద్యోగులపై ప్రభుత్వ దృష్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదవి విరమణ పొందినప్పటికి వివిధ హోదాల్లో పని చేస్తున్న విశ్రాంత ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. రిటైర్డ్ ఉద్యోగులను గత ప్రభుత్వం వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, బోర్డుల్లో నియమించింది. వారి నైపుణ్యం, ప్రతిభ ఆధారంగా కాకుండా తమకు నచ్చిన వారిని ఇష్టారీతిన నియమించిందనే విమర్శలు కూడా అప్పట్లో వెల్లువెత్తాయి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వారందరిని తప్పించాలనే ఆలోచనతో ఉన్నట్టు తెలుస్తోంది. పక్షం రోజుల క్రితం రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్ చైర్మెన్లను తొలగించిన సర్కార్, అదే తరహాలో ఉద్యోగులు, అధికారులు, మెంబర్లు తదితర పదవుల్లో కొనసాగుతున్న వారిని మార్చాలని నిర్ణయించినట్టు సమాచారం. సర్కార్ ఆలోచనకు అనుగునంగా వారి లెక్కలను తీసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఏ శాఖలో ఎంత మంది ఉన్నారు? ఏ ఏ హెూదాలో పని చేస్తున్నారు? వారి కాల పరిమితి ఎంత? వివరాలను వెంటనే తెలపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇప్పటికే అన్ని శాఖలకు ఉత్వర్వులు జారీ చేసినట్టు సమాచారం.

పేదోళ్ల గుడిసెలు కూల్చడం అన్యాయం

- జగిత్యాలలో గుడిసె వాసులపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు
- బుధ, గురువారాల్లో నిరసనలు : ఎస్ వీరయ్య

ప్రజాశక్తి-హైదరాబాద్

జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూమిలో పేదోల్లు వేసుకున్న గుడిసెలు కూల్చటం అన్యాయమని, అరెస్టు చేసిన గుడిసె వాసులను వెంటనే విడుదల చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య డిమాండ్ చేశారు. నాన్ బైలబుల్ కేసులో జైలులో ఉన్న జి తిరుపతి నాయక్, జి నాగరాజు, జి రమేష్, జి పోచన్న, లెల్లల బాలకృష్ణ, కొంచపు శంకర్, పిట్టల హేమలత, రజియా సుల్తానాలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాసంఘాల కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వంచారు.

గుడిసె వాసులపై నిర్బందానికి నిరసనగా బుధ, గురవారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఇళ్లను కూల్చేసి, తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా అరెస్టులు చేశారని పేర్కొన్నారు. తొమ్మిదిమంది గుడిసెవాసులను నాన్‌బెయిల్‌బుల్ కేసులు పెట్టి కరీంనగర్ జైలుకు పంపారని తెలిపారు. అర్ధరాత్రి దొంగలపై దాడులు చేసినట్టుగా నాయకులను గుడిసవాసులను భయబ్రాంతులకు గురిచేయడమేంటని ప్రశ్నించారు. ప్రజా సంఘాల కార్యాలయాలు, ఇళ్లల్లో చొరబడి అరెస్టులు చేయడాన్ని తగదన్నారు. రెండేళ్లుగా ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేద ప్రజలపై పోలీసులు, అధికారులు పలు మార్లు అక్రమంగా గుడిసెలు కూల్చివేయడం, అరెస్టులు చేసి, స్టేషన్‌లో నిర్బందిస్తున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలోని వివిధ భూ పోరాట కేంద్రాల్లోనూ పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, కేసులు పెడుతున్నారని విమర్శించారు.

మహబూబాబాద్, హనుమకొండ, కోరుట్ల భూ పోరాట కేంద్రాల్లో పేదలు గుడిసెలు వేసుకొని నివాసాలు ఉంటున్నారని తెలిపారు. ఆ కేంద్రాలపై అర్ధరాత్రులు అక్రమంగా పేదలను అరెస్టులు చేసి గుడిసెలను తొలగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఉద్దేశ పూర్వకంగా పేద ప్రజల గుడిసె కేంద్రాలపై నిర్బంధాన్ని ప్రయోగించడం సరి కాదన్నారు.

ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకనుగుణంగా పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కల్పించడం కూడా ప్రభుత్వం బాధ్యతేనని తెలిపారు. తక్షణమే గుడిసె వాసులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివాసాలుంటున్న పేద ప్రజలందరినీ అర్హులుగా గుర్తించి ఇండ్ల స్థలాలకు భూ పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జి నాగయ్య, చుక్కా రాములు, టి సాగర్, పాలడుగు భాస్కర్, భూపాల్, అరుణ జ్యోతి, కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్లు సమ్మె విరమించుకోవాలి

- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-హైదరాబాద్

లారీ డ్రైవర్లు సమ్మెను విరమించుకోవాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. డ్రైవర్ల సమస్య కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదనీ, తాము దాన్ని అర్థం చేసుకోగలమని చెప్పారు. సమ్మె ద్వారా రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని మంగళవారంనాడొక పత్రికా ప్రకటన ద్వారా కోరారు. కేంద్ర ప్రభుత్వం మోటారు వాహన చట్టంలోని 106 (2) హిట్ అండ్ రన్‌కి సంబంధించిన సెక్షన్‌ని ఇప్పట్లో అమలు చేయబోమని కేంద్ర హెూంశాఖ కార్యదర్శులు ప్రకటించారనీ, భవిష్యత్‌లో అమలు చేయాల్సి వస్తే డ్రైవర్లు, లారీ యజమానులతో చర్చించే నిర్ణయం తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అజయ్ భళ్ల హామీ ఇచ్చారని తెలిపారు. గుర్తింపు లేని కొన్ని సంఘాలు బుధవారం నుంచి సమ్మె చేయాలని భావిస్తున్నారని, ఈ నిర్ణయాన్ని గుర్తింపు పొందిన సంఘాలతో పాటు మెజారిటీ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని వివరించారు. సమ్మెలోకి వెళ్తే సామాన్య ప్రజలు ఇబ్బందులు పడతారని, దానిపై పునరాలోచన చేయాలని కోరారు.

మాంసం విషయంలో గొడవ

- వ్యక్తి హత్య

ప్రజాశక్తి-హైదరాబాద్

మాంసం విషయంలో జరిగిన గొడవ ఓ వ్యక్తి హత్యకు దారి తీసింది. మద్యం మత్తులో ఉన్న వ్యక్తిని స్నేహితుడు కత్తితో పొడిచిన ఘటన సికింద్రాబాద్ తుకారంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ గోల్‌బాయ్ బస్తీకి చెందిన కుంభలి అజయ్ (30), చారి స్నేహితులు. అజయ్ రోజువారి కూలి పనులు చేసుకుని జీవన సాగించే వ్యక్తి. సోమవారం అజయ్, చారి పండుగ సందర్భంగా మటన్, మందు తెచ్చుకుని పార్టీ చేసుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్యలో మటన్ తినే విష యంలో వివాదం తలెత్తింది. చారి కత్తితో దాడి చేయడంతో అజయ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. తుకార గేట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు నెలల్లో భూసేకరణ

- ఇదే వ్యవధిలో పనులకు టెండర్లు
- రీజనల్ రింగ్ రోడ్డుపై సిఎం ఆదేశాలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను మూడు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు. అడ్డంకులన్నీ అధిగమించి, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు అవతల నిర్మించ తలపెట్టిన రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ ప్రక్రియ కొంతకాలంగా పెండింగ్‌లో పడిన సంగతి తెలిసిందే. భారత్ మాల పరియోజన ఫేజ్ వన్‌లో రీజనల్ రింగ్ రోడ్డు (ఉత్తరం) 158.645 కిలోమీటర్ల మేరకు తలపెట్టారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సగం వాటా నిధులు భరించాల్సి ఉంటుంది. 1935.35 హెక్టార్ల భూసేకరణ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 1459.28 హెక్టార్ల భూసేకరణ పూర్తయింది. నేషనల్ హైవే అథారిటీతో తలెత్తిన చిక్కుముడులు పరిష్కారం కాకపోవడంతో ఈ ప్రాజెక్టు ఆగిపోయింది. దీనిని ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది.

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు తెలంగాణను మూడు క్లస్టర్లుగా విభజించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. అవుటర్ రింగ్ రోడ్డు లోపల అర్బన్ తెలంగాణ, ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ రీజినల్ రింగ్ రోడ్డు వరకు సెమీ అర్బన్ క్లస్టర్, రీజనల్ రింగ్ రోడ్డు తర్వాత ఉన్న ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్‌గా గుర్తించి పరిశ్రమల స్థాపనకు కొత్త విధానాన్ని రూపొందిస్తోంది. ఇందులో భాగంగా రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును అత్యంత వేగంగా పూర్తి చేయాల్సిన అవసరాన్ని సిఎం అధికారులతో చర్చించారు. ఈ రహదారి పూర్తయితే రవాణా సదుపాయాలతో సెమీ అర్బన్ జోన్లో కొత్త పరిశ్రమలు రావటంతో పాటు అభివృద్ధి వేగం పుంజుకుంటుందని అన్నారు.

నిలిచిపోయిన భూసేకరణను రాబోయే మూడు నెలలలో పూర్తి చేయాలని, భూసేకరణతో పాటే ఆర్ఆర్ఆర్ (ఉత్తరం) పనులకు టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ (దక్షిణం) భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించాలని, తదుపరి భూసేకరణ ప్రణాళికను రూపొందించాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాని కోరారు. రీజనల్ రింగ్ రోడ్డు పూర్తి చేసేందుకు ఆర్థికంగా ఎంత భారమైనా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ రేసులో అద్దంకి, మహేష్‌కుమార్

- నేడు అధికారిక ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థులను ఖరారు చేయడంలో అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్న కాంగ్రెస్... టిపిసిసి ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ పేర్లను సూత్రప్రాయంగా ఖరారు చేసినట్టు తెలిసింది. అయితే అద్దంకి, బల్మూరు వెంకట్ పేర్లు ఖరారు చేసినట్టు మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ విషయాన్ని పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. కానీ ఎమ్మెల్యే కోటాల్లో ఎమ్మెల్సీ ఆశిస్తున్న వారిలో మాజీ మంత్రి జి చిన్నారెడ్డి, షబ్బీర్ అలీ, అంజన్‌కుమార్‌యాదవ్, ఫిరోజ్‌ఖాన్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు బల్మూరు వెంకట్ తదితరులు ఉన్నారు. గురువారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్సీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

గవర్నర్ కోటాలో కోదండరాం, అమేర్ అలీఖాన్

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులను కాంగ్రెస్ ఖరారు చేసింది. అందులో టిజెపి అధ్యక్షులు కోదండరాం, సియాసత్ న్యూస్ ఎడిటర్ అమేర్ అలీఖాన్ ఉన్నట్టు తెలిసింది. ఎమ్మెల్యే కోటా, గవర్నర్ కోటాలోని అభ్యర్థుల పేర్లను బుధవారం ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

పతంగులు ఎగరవేస్తూ యువకుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పతంగులు ఎగరవేస్తూ ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన హైదరాబాద్ మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహమత్‌నగర్‌లో నివసిస్తున్న కపిల్ దేవ్ చౌహాన్(23) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం పండుగ సందర్భంగా స్నేహితులు ఆకాష్, జగదీష్‌తో కలిసి మొదటగా బిల్డింగ్‌పై మద్యం తాగారు. అనంతరం నాలుగో అంతస్తుపై కపిల్ దేవ్ చౌహాన్ పతంగులు ఎగరవేస్తుండగా కాలుజారి భవనంపై నుంచి కింద లిఫ్ట్ కోసం తవ్వించిన గుంతలో పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు.

అతని సోదరుడు చౌహాన్ దేవ్ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాలుజారి పడిపోయాడా లేక మరెవరైనా తోసేశారా అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విలేకరుల సమావేశంలో డీసీపీ రవీందర్

ఐదు ఎటిఎంలు ధ్వంసం.. చోరీకి యత్నం

- నాలుగు గంటల వ్యవధిలోనే నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో ఐదు ఎటిఎంలను ధ్వంసం చేసి.. చోరీకి యత్నించిన నిందితున్ని నాలుగ్గంటల్లోనే పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి స్థానిక పోలీసు స్టేషన్‌లో వరంగల్ తూర్పు డిసిపి పులిగిళ్ల రవీందర్ వివరాలు వెల్లడించారు. నర్సంపేట పట్టణానికి చెందిన మేడిద వంశీ కొరియర్‌గా పనిచేస్తూ జల్సాలకు అలవాటు పడ్డారు. మద్యానికి బానిసై ఎటిఎంలలో దొంగతనం చేయాలని ప్లాన్ చేశాడు. ఈ నెల 15న అర్ధరాత్రి ద్వారకపేట రోడ్డులోని ఎస్‌బిఐ, మల్లంపెల్లి రోడ్డులోని ఎస్‌బీఐ, వరంగల్ రోడ్డులోని హెచ్‌డిఎఫ్‌సి, నెక్కొండ రోడ్డులోని కెనరా, పాకాల రోడ్డులోని కొటక్ మహేంద్ర ఏటీఎంలను ధ్వంసం చేశాడు. వాటిల్లో చోరీ చేసేందుకు యత్నించి విఫలమయ్యాడు. ఇదే సమయంలో పాకాల రోడ్డులోని కొటక్ మహేంద్ర ఏటీఎం సమీపంలో రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు అనుమానం వచ్చి అక్కడికి వెళ్లారు. వారిని చూసి నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించగా.. సిపి ఆదేశాల మేరకు ఏసీపీ తిరమల్, సీఐ రవికుమార్ నేతృత్వంలో రంగంలోకి దిగారు. సిసి టివి పుటేజీలు, లోకల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా విచారణ చేపట్టారు. 4 గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్నారు. ఈ సంఘటనలో రూ.4 లక్షల నుంచి రూ.5లక్షల నష్టం వాటిల్లి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. వంశీని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసును ఛేదించడంలో హెడ్ కానిస్టేబుల్ ఎండి.అక్బర్ పాషా, కానిస్టేబుల్ శ్రీధర్, టి.రమేష్ ముఖ్యపాత్ర పోషించారని, ఏసీపీ పి.తిరమల్ పర్యవేక్షణలో సిఐ, ఎస్ఐ ప్రతిష్టాత్మకంగా తీసుకుని విచారణ చేశారని డీసీపీ రవీందర్ వారిని అభినందించారు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో



తెలంగాణలోని మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాల కోసం ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. 204 పాఠశాలల్లోని ఐదో తరగతి ప్రవేశాలకు ముస్లిం, క్రిస్టియన్, పార్సీ, జైన్, సిక్కులతోపాటు మైనార్టీయేతర ఒసి, బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు దరఖాస్తు చేసుకోవచ్చు. మైనార్టీలకు మొదట వచ్చిన వారికి మొదటి సీటు ప్రాతిపదికన, మిగతా వారికి లక్కీడ్రా ద్వారా సీట్లు కేటాయించనున్నట్టు మైనార్టీ గురుకుల సొసైటీ కార్యదర్శి ఆయిషా ముసరత్ ఖానమ్ తెలిపారు. 6 నుంచి ఎనిమిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కార్యదర్శి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 194 జూనియర్ కాలేజీలు, 10 సిఒఇ కాలేజీల్లో ఇంటర్ మొదటి ఏడాదికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. పదో తరగతి జిపిఎ ఆధారంగా జూనియర్ కాలేజీల్లో సీట్లు కేటాయిస్తారు. సిఒఇ కాలేజీల్లో ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నట్టు కార్యదర్శి తెలిపారు. www.tmreistelangana.cgg.gov.in వెబ్ సైట్ లేదా గూగుల్ ప్లేస్టోర్‌లోని TMREIS మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కార్యదర్శి వెల్లడించారు. అనుమానాలను మైనార్టీ గురుకులాల ప్రధానోపాధ్యాయులు లేదా వెబ్ సైట్‌తో పాటు 040-23437909 హెల్ప్ లైన్ ద్వారా నివత్తి చేసుకోవచ్చని తెలిపారు.

ఉద్యోగం పేరిట నకిలీ ఉత్తర్వులు

డయాలసిస్ కేంద్రంలో ఉద్యోగమంటూ లెటర్

ఒక్కో ఉద్యోగానికి రూ.లక్షల్లో వసూలు..!

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి అనుబంధంగా నిర్వహిస్తున్న డయాలసిస్ కేంద్రంలో ఉద్యోగాల కల్పన పేరిట నకిలీ ఉత్తర్వులు అందించిన వైనం మంగళవారం వెలుగులోకి వచ్చింది. నిరుద్యోగులకు ఆశలు కల్పించి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు రూ.లక్షలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని ప్రభు త్వ పర్యవేక్షణలో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్(పిపిపి) పద్ధతిలో నిర్వహిస్తున్నారు. ముంబయి కేంద్రంగా పని చేస్తున్న అఫెక్స్ కిడ్నీ కేర్ ప్రైవేటు లిమిటెడ్ అనే ఏజెన్సీకి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఆ సంస్థ అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగులను నియమించుకుని డయాలసిస్ కేంద్రం నిర్వహిస్తోంది. ఇద్దరు టెక్నీషియన్‌లు, స్టాఫ్ నర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హౌస్‌కీపింగ్ వర్కర్లు పని చేస్తున్నారు. ఇక్కడేమీ ఖాళీలు లేవు. కానీ ఆ ఏజెన్సీ పేరిట ఉద్యోగ నియామక ఉత్తర్వు కాపీని యువతికి అందజేశారు. ఆ ఉత్తర్వుల కాపీతో ఓ వ్యక్తి బెల్లంపల్లి డయాలసిస్ కేంద్రానికి మంగళవారం వచ్చాడు. ఆ ఏజెన్సీ ఇన్‌చార్జి బుర్రి సాయికుమార్‌కు ఉత్తర్వు కాపీని అందజేయడంతో నకిలీది గా గుర్తించాడు. ఆ వ్యక్తి నుంచి వివరాలు ఆరా తీ యగా కంగారుపడి ఓ ఫోన్ నంబరు ఇచ్చి అక్కడి నుంచి జారుకున్నాడు.